టైం బాంబ్!

ఏ. వీ. మోహన్రావ్

అర్ధరాత్రి ఆరో నెంబరు ఇంటిముందు టాక్సీ ఆగింది. వెనుక తలుపు తెరచుకొని దిగింది అందంగా వున్న పాతికేళ్ళ స్త్రీ. చేతిలోవున్న హాండ్ బ్యాగ్ బరువుగా వున్నట్లు ఆమె పట్టుకొన్న తీరును చూచి ఎవరైనా ఊహించవచ్చు.

"మేడమ్! వెయిట్ చెయ్యమంటారా?" అడిగాడు డ్రైవరు.

"పదినిముషాల్లో వస్తాను!" అంటూ మెట్లెక్కింది.

కాలింగ్ బెల్ నొక్కింది.

రెండు క్షణాల తర్వాత తలుపులు తెరచుకొన్నాయి. అవతలివేపు నైట్ డ్రెస్‌లో వున్న అందమైన అమ్మాయి

నిలుచుని వుంది.

"ఎవరు కావాలి?" అడిగింది లోపలున్న అమ్మాయి.

"నువ్వే!" చెప్పింది టాక్సీలోంచి దిగినావిడ.

"మీరెవరో నాకు గుర్తురావడం లేదు! అసలు ఇంతకు ముందెప్పుడూ చూచినట్లు కూడా లేదు. నాతో ఏం పని?" అడిగిందా అమ్మాయి మళ్ళీ.

"ఇలా వీధిలో మాట్లాడుకోవడం నాకు నచ్చదు. లోపలికెళ్ళి మాట్లాడుకుందాం!" అంది.

"రండి!" అంటూ ఆ అమ్మాయి వెనక్కి నడిచింది.

టాక్సీలోంచి దిగిన అమ్మాయి అనుసరించింది.

ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు సోఫాల్లో.

"చెప్పండి!" అంది నైట్ డ్రెస్‌లో వున్న అమ్మాయి.

"అరుణా రాణివి నువ్వే కదూ!" అడిగింది టాక్సీలోంచి దిగినావిడ.

"అవును! నేనే! మీరెవరో చెప్పండి!"

"శాంతిలాల్ జైన్‌ను నీకు తెలుసుగా?"

"తెలుసు!"

"నేనతని భార్యను. అతను నన్ను అగ్నిసాక్షిగా పెళ్ళాడాడు. మాకు ఇద్దరు పిల్లలుకూడ వున్నారు."

"మీ పేరు!"

"విజయ కౌర్! అందరూ విజయనే అంటారు. ఆ పేరుతో పిలిస్తే చాలు!"

"ఇంతకూ నా దగ్గర కెందుకొచ్చారు."

"అరుమాసాలనుండి నా భర్త నాతో సరిగా కాపరం చెయ్యడం లేదు. వ్యాపారపు పనులంటూ రోజుల తరబడి ఇంటికి దూరంగా వుంటున్నాడు. నష్టం వస్తుందంటూ

చాలా నగలు, తీసుకెళ్ళి అమ్మివేశాడు. ఇన్నాళ్ళు హాయిగా బ్రతికాం. ఇప్పుడు తిండికి కూడా వాచిపోయే ప్రమాదం వచ్చి పడింది. అందుకే ఇల్లు వదలి ఇలా వీధిన పడవలసి వచ్చింది!'' చెప్పింది విజయ.

''మీ సమస్యలకు పరిష్కారం నా యింట్లో దొరుకుతుందని ఎలా అనుకున్నారు?'' అడిగింది అరుణారాణి.

''నీ జాణతనం నాదగ్గర చూపించకు. ఆయన్ని నువ్వు వల్లో వేసుకోలేదూ?'' అడిగింది విజయ అసూయగా చూస్తూ.

''మాటలు తిన్నగా రానీ! అవాకులూ చెవాకులూ పేలావంటే పళ్ళు రాలగొడతాను?'' అంది అరుణారాణి కోపంగా.

''కానీ! చేసి చూపించు!!'' అంటూ కుర్చీలోంచి లేచి దగ్గరకంటా వెళ్ళింది విజయ ఆమెకు.

అరుణ వెనక్కి నడిచింది.

''భయపడిపోతున్నావేం వెనక్కి?'' అంటూ పైపైకి పోయి అరుణజుట్టు పట్టుకుంది. ఆమెకూడా విజయతో కలబడింది.

ఇద్దరూ ఒకర్నొకరు త్రోసుకున్నారు.

పట్లు విడవకుండా క్రిందపడ్డారు. తమాయించుకొని లేచారు. కాళ్ళతో కుమ్ముకున్నారు. ఆపకుండా ఒకర్నొకరు తిట్టుకుంటూనే వున్నారు.

ఇంట్లోనుండి ఎవరన్నా అరుణకు సాయంవచ్చి తన్నుతంతారేమోనని అనుమానంగా లోపలినుండి హాల్లోకి వచ్చే గుమ్మంకేసి కన్నువేసే వుంచింది విజయ. కానీ ఎవ్వరూ వస్తున్న జాడలేకపోవడంతో ధైర్యం ఎక్కువయిందామెకు.

"మర్యాదగా నన్నొదలి వెళ్ళిపో! లేకుంటే నీ అంతు చూస్తాను!" అంది అరుణ.

"నీ అంతు చూడకుండా మాత్రం పోను నేను!" అంది విజయ జుట్టు ఇంకొంత గుంజి ఘట్టిగా క్రిందకు లాగుతూ.

అరుణకు తన బలం ఆమెను ఎదుర్కొనేందుకు చాల లేదన్న విషయం అర్థమైంది. అలానే వుంటే విజయ చావ చితకతన్నిపోవటం తథ్యమని కూడా తెలుసుకుంది. తోడుగా వుండే తల్లి ప్రొద్దున్నే బజారు వెళ్ళింది. ఆమె ఇంట్లో వుండివుంటే కొంతలో కొంత సాయంగా వుండి వుండేదనుకొంది.

పెద్దగా గావుకేకలు పెట్టడం మొదలెట్టింది. ఆ శబ్దం వీధిలోకి వినిపిస్తే, రోడ్‌న వెళ్ళే జనం వచ్చి అల్లరవుతుందని విజయకు భయంపుట్టింది. ఒక చేతో అరుణ నోరు మూసింది. అయినా ఆమె ఆగకుండా ఆ చేతిని విదలించివేసి అరుపులు పెట్టింది.

ముందు విజయను తీసుకొచ్చిన టాక్సీ డ్రైవరు, ఆ తర్వాత మరో ముగ్గురు నలుగురు వీధివెంట వెళ్ళే మగాళ్ళు లోనికొచ్చారు, ఇద్దర్ని విడదీసి చెరోవైపుకు లాగేశారు.

లోనికొచ్చిన జనానికి ఈ కొట్లాట ఎందుకొచ్చిందో తెలుసుకోవాలన్న ఉత్సుకత కలిగింది. ఇద్దర్ని అడిగారు. ఇద్దరూ చెప్పకుండా తప్పించుకున్నారు.

విజయ వెలుపలికొచ్చి టాక్సీ ఎక్కి కూర్చుంది. టాక్సీ డ్రైవరు వచ్చి స్టార్ట్ చేశాడు.

"ఎందుకమ్మా ఆమెనలా అల్లరిపెట్టావ్?" అడిగాడు టాక్సీ డ్రైవరు విజయను.

"నువ్వు నీ భార్యను వదిలేసి ఇంకెవరితోనన్నా తిరుగు తున్నావా?" అడిగింది విజయ.

"లేదమ్మా!"

"అయితే నీ కర్థంకాదు" అంది ముక్తసరిగా.

టాక్సీ డ్రైవరు తన కేదో అర్థమైనట్లుగా నవ్వటం అద్దంలోంచి చూచి గమనించింది విజయ.

"అమ్మా!" పిలిచాడు డ్రైవరు.

"ఏమిటి?"

"మీ సమస్య నా కర్థమైంది. కానీ మగణ్ణి అదుపులో పెట్టుకోవాలిగాని, ఇలా సాటి ఆడదానిపైకి వెళ్ళడం తప్పనిపిస్తూంది నాకు!"

"నువ్వన్నది నిజమే, కానీ ఆ దరిద్రుడు నా కొంప ఛాయలక్కూడా రావడంలేదు సరిగా. ఏంచేసేది? ఎటూ తోచక ఇటొచ్చాను."

టాక్సీ విజయ కాపురముంటున్న రోడ్ మొదట్లోకి రాగానే ఆపించి డబ్బిచ్చి దిగి నడచి వెళ్ళింది.

2

ఆ రోజు సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో విజయ వంటపని చేసుకొంటూ వుంటే తలుపుతట్టిన చప్పుడయి వచ్చి తెరచింది. ఎదురుగా సాక్షాత్తు తనభర్తయిన శాంతి లాల్ దర్శనమిచ్చాడు. ఆమె మనస్సు ఆనందంతో గంతులు వేసింది. అంతలోనే తనపట్ల అతను ఇన్నాళ్ళనుంచి చూపు తున్న అనాసక్తత, అశ్రద్ధ గుర్తుకొచ్చి, అసహ్యం పుట్టు కొచ్చింది.

"లోనికి రావచ్చా?" అడిగాడు శాంతిలాల్ బిక్క పోయినట్లు.

"రావటానికికూడా అర్హత పోయిందేమోనని మీకు అనుమానంగా వుందా?" అడిగింది విజయ.

"అదికాదు!"

"ఇంకేది?"

"కోపంగా వున్నావేమోనని" నసిగాడు శాంతిలాల్.

"అలా గడపబైటే నిలుచుని ఎంతసేపు మాట్లాడుతారు. లోనికి రండి!" అంటూ గదిలోకి దారితీసింది విజయ.

"ఆ వగలాడి మిమ్మల్ని వదలిపెట్టిందా?"

"ఎవరే నువ్వు చెప్పే వగలాడి?"

"తెలీనట్లు అమాయకుల్లా మాట్లాడుతారే. ఆ అరుణా రాణి పూర్తిగా మిమ్మల్ని గోరిగి మరీ పంపిందిగదూ!"

"ఛా! ఏమిటా మాటలు. అలాంటి పేరుగలవాళ్ళెవరూ నాకు తెలీదు. నేను వ్యాపారపు వ్యవహారాల్లో ఊళ్ళు తిరుగుతూండిపోయాను."

"వ్యాపారంలో మళ్ళీ నష్టం వచ్చిందిగదూ! నా దగ్గర మిగిలిందేమైన ఉందేమో అదికూడా లాక్కుపోదామని వచ్చి వుంటారు. ప్రాణాలు మాత్రం వున్నాయి. కానే వాళ్ళుంటే వాట్నికూడా అమ్ముకోండి" అంది విజయ కోపంగా.

"విజయా! మరీ నన్ను రాక్షసుడిలా చిత్రించకు. వ్యాపారం అన్న తర్వాత లాభాలు రావడంతో నష్టాలు వస్తాయి. నష్టాల తర్వాత లాభాలు వస్తాయి. అది సహజం పోయినదఫా నష్టంవచ్చి నీ నగలు తీసుకొన్నాను. ఈసారి విపరీతమైన లాభాలు వచ్చాయి. నిన్ను బంగారంలో ముంచి తేలుస్తాను." అన్నాడు గర్వంగా శాంతిలాల్.

"నన్నెందుకు? ఆ రంగేళీ రంకుముండ అరుణారాణిని ముంచండి. అనందిస్తుంది!" అంది విజయ కోపంగా.

శాంతిలాల్ కు ఆమెను ఎలా ఊరడించాలో, ఎలా తనవేపు ప్రసన్నంచేసుకొని, త్రిప్పుకోవాలో అర్థంగాక అయోమయంగా ఆమె కళ్ళలోకి చూడసాగాడు.

"జరిగింది చెప్తాను. వినే ఓపికుందా నీకు?"

"చెప్పండి వింటాను."

"నీ నగలు అమ్మి డబ్బుతీసుకొని గోవా వెళ్ళాను. అక్కడ నాకో పెద్ద స్మగలర్ పరిచయమయినాడు. అతన్ని ఏదైనా మంచి వ్యాపారం చూపించమని బ్రతిమలాడాను. నామీద దయతలచి గంజాయి కొని సేకరించుకొని తెచ్చి ఇస్తే, అది తీసుకొని బంగారు బిస్కెట్లు ఇస్తానన్నాడు. అతను చెప్పిన ప్రకారం చాలా ఊళ్ళు తిరిగి గంజాయి సేకరించి తెచ్చి ఇచ్చాను. అది తీసుకొని బంగారం ఇచ్చాడు. ఆ బంగారం అమ్మి మళ్ళీ గంజాయి తెచ్చాను. ప్రస్తుతం నా దగ్గర నలభై కిలోల బంగారం వుంది."

అంత బంగారం గురించి వినగానే విజయకు నీరుగారిపోయింది. భర్తపైనున్న కోపమంతా అంతర్థానమైంది.

"ఎక్కడ దాచారు" అడిగింది రహస్యంగా.

"అక్కడే ఒకచోట దాచాను. ఆ వ్యాపారంలో స్థిరపడిపోదామనుకుంటున్నాను. గంజాయి తెచ్చి ఇచ్చే ఏజంట్లను నియమించుకుంటే చాలు. ఒక క్రమపద్ధతిలో వ్యాపారం జరిగిపోతుంది." అన్నాడు శాంతిలాల్.

"అంతా బంగారేనా? క్యాష్ కూడా ఏమైనావుందా?"

"లక్షదాకా వుంది. నీకిద్దామని పదివేలు తెచ్చాను ఖర్చులకోసం." అంటూ జేబులోంచి వందరూపాయల

నోట్లకట్టొకటి తీసి అందించాడు. విజయ దాన్ని అందుకుని, జాకెట్ లో దోపుకోను ప్రయత్నించింది. రొమ్ములను అదిమి పట్టుకొనివున్న జాకెట్, ఆ కట్ట పట్టడానికి కావలసినంత స్థలం ఇవ్వకపోవడంతో తన ప్రయత్నం మానుకొంది విజయ.

"ఇప్పటికైనా కోపం తగ్గిందా?" అడిగాడు కాంతిలాల్.

"తగ్గలేదు! మీరు వెళ్ళి మొహం కడుక్కురండి. కాఫీ ఇస్తాను!" అంటూ హడావుడిగా వెళ్ళి కాఫీ, టిఫను తయారుచేసి తెచ్చి ఇచ్చింది.

పకోడీలు నములుతూ భార్యవేపు చూశాడు కాంతిలాల్. తన కళ్ళలోకి ఆమె చూస్తున్నట్లు అనిపించింది.

"ఏమిటి విజయా? అలా చూస్తున్నావ్?"

"ఏంలేదు! మీకూ ఆ అరుణారాణికి అసలు సంబంధం లేదా?"

"నీమీద ఒట్టు! ఆమె ఎవరో కూడా నాకు తెలీదు!" ప్లేటు తన నెత్తిన పెట్టుకుంటున్నట్లుగా చూపించి అన్నాడు కాంతిలాల్.

"మరి మన ప్రక్కింటి రతన్ లాల్ భార్య విమల చెప్పిందే నాకు, మిమ్మల్ను చాలాసార్లు ఆ అమ్మాయితో చూచినట్లు, వాళ్ళాయన చెప్పాడట" అంది విజయ.

"వాడి రహస్యం నేనెక్కడ బైటపెడతానోనని, భయంతో ఇలా ముందే నాగురించి లేనిపోనివి చెప్పాడన్న మాట! రాస్కెల్. వాడి అంతు తేలుస్తాను రేపు!" పళ్ళు కొరికాడు కాంతిలాల్.

"అయిందేదో అయింది. అతని జోలికి వెళ్ళకండి.

ఇంతకూ అతనికేమిటి రహస్యం!'' మరో రెండు పకోడా పలుకులు ప్లేట్లో వేస్తూ అడిగింది.

''వాడు అసలు ఆ అరుణారాణిని ఉంచుకొనున్నాడు. వాళ్ళిద్దరూ ఒకసారి నాకు పూనాలో కలిశారు. వాణ్ణి దూరంగా పిలిచి చీవాట్లు పెట్టాను. ఇంట్లో వాడి పెళ్ళాంతో చెప్పి చీపురుదెబ్బలు వేయిస్తానన్నాను.''

''అలాగా! అయినా ఇంత పచ్చిగా అబద్ధాలు చెప్తాడనుకోలేదు!'' అంది విజయ.

ఆ రాత్రంతా ఇద్దరూ హాయిగా గడిపారు. శాంతిలాల్ భార్యకు ముందు ముందు తాము ఎలాంటి జీవితం గడపబోయేది ఊహించి అందంగా చెపుతూంటే ఆమె ఊరి ఉబ్బి తబ్బిబ్బయి తన్నుతనే మరచిపోయి మసలుకొంది.

తెల్లారాక బజారు వెళ్ళి భోజనానికి తిరిగొస్తానని చెప్పాడు శాంతిలాల్. ఆరోజు అతని కిష్టమైన వంటకాలన్నీ చేసింది విజయ.

ఒంటిగంట కొచ్చి భోజనం చేశాడు.

కాసేపు పడుకుని విశ్రాంతి తీసుకున్నాడు.

నిద్రలేచి కాఫీ త్రాగి భార్యను పిలిచి, వెంట తెచ్చిన బ్రాండ్ కేస్‌లోంచి కొన్ని కాగితాలు తీసి, అక్కడక్కడ సంతకాలు చేయించాడు.

ఆ ఫారాలు ఏమిటో అర్థంగాలేదు. అడిగింది భర్తను. ఆమె పేర ఇల్లు కొంటున్నట్లుగా చెప్పాడు గోపాలో.

''పెద్దదేనా?'' అడిగింది పేనా మూత పెడుతూ.

''ఆ పెద్దబంగళా. మొత్తం నలభై గదులున్నాయి. మరీ చౌకగా దొరికింది. దాని ఓనరు ఇక్కడున్నాడు.

ప్రొద్దున్నే వెళ్ళి చెక్ రాసిచ్చి, కాగితాలు తయారు చేయించి తెచ్చాను'' అన్నాడు శాంతిలాల్.

''మనం ఎప్పుడు వెళ్దాం?''

''నేను రేపు వెళ్తాను. నీకు పైనెల పదో తేది గోవా వచ్చేందుకు విమానంలో టిక్కెట్టు కొన్నాను. ఈలోగా నేను చాలా ఊళ్ళు తిరిగి ఏజంట్లను నియమించాలి. ఆ రోజుకు గోవాకు చేరుకుంటాను. ఎయిర్ పోర్ట్లో రిసీవ్ చేసుకుంటాను. ఇక్కడి సామానంతా వదిలేసెయ్. అన్నీ అక్కడ కొందాం క్రొత్తగా'' అన్నాడు శాంతిలాల్.

''పైనెల పదో తేదీ అంటే సరిగ్గా నెలరోజుల కన్న మాట!''

''అవును!''

''ముందుగా రాలేరా?''

''వీలుకాదు విజయా! దాదాపు వంద ఊళ్ళు తిరగాలి నేను.''

''సరేలెండి! మీరు రావడం మరచిపోయేరు. తీరా విమానం దిగాక మీరు కనిపించకుంటే నా పని ఏమైనా వుంటుంది!'' అంది భయంగా విజయ.

''అలాంటి భయమేమీ పెట్టుకోకు. నేను హాజరుగా వుంటాను అక్కడ నీకోసం!'' అన్నాడు శాంతిలాల్.

విజయ సంతకాలు చేసిన కాగితాలన్నీ ఒక పెద్ద కవరులో పెట్టుకున్నాడు అది తీసి బ్రీఫ్ కేస్లో జాగ్రత్తగా సర్దుకున్నాడు.

మధ్యాహ్నం మూడుగంటలకు ముస్తాబై బజారు కెళ్లారు. విజయ ఇంట్లోకి కావలసినవన్నీ కొనుక్కుంది.

ఆ తర్వాత ఇద్దరూ సినిమాకు వెళ్ళారు.

సినిమా వదిలాక హోటల్‌లో భోజనంచేసి ఇల్లు చేరు కున్నారు. తెల్లారాక బట్టలు సర్దుకుని భార్య దగ్గర శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు శాంతిలాల్. విజయ అతను కనుపించినంత దూరం చూస్తూ వుండిపోయింది గుమ్మంలో.

3

పదో తేదీ వచ్చింది.

విజయకు మొత్తం హడావుడిగా వుంది.

ఆరోజే ఆమె విమానంలో గోవాకు వెళ్ళాలి. పిల్లలిద్దర్నీ తల్లిదగ్గర ముందే దిగవిడిచివుంది. ముందు వాళ్ళనుకూడా పిల్చుకొని వెళ్దామనుకుంది గోవాకు. కానీ ఇల్లు సర్దుకుని, వచ్చి తీసుకెళ్ళటం మంచిదన్న నిర్ణయాని కొచ్చింది.

తొమ్మిదింటికల్లా ఎయిర్‌పోర్ట్ చేరుకొంది విజయ. సెక్యూరిటీ చెకింగ్ ముగిసేసరికి పదయింది.

మరో అరగంటలో విమానం బయలుదేరుతుందని తెలుసుకొంది. ఆ విమానం కలకత్తానుండి వచ్చి, ఇక్కడ ఆగి ఆ తర్వాత గోవా వెళుతుందని కూడా అడిగి తెలుసు కొంది.

వాతావరణం బాగులేనందువల్ల గోవాకు పోవలసిన విమానం కలకత్తానుంచి ఆలస్యంగా బయలుదేరిందనీ, మరో రెండుగంటల్లో శాంతాక్రజ్‌కు చేరుకుంటుందనీ, చేసిన అనౌన్స్‌మెంట్ విని కాస్త నిరుత్సాహపడింది.

ఆమెకు వీలైనంత త్వరగా గోవాకు చేరుకొని, తమ కోసం భర్తకొన్న క్రొత్త ఇల్లు చూడాలనీ, భర్త దాచి పెట్టిన బంగారం ఒకమారు చేత్తో తాకి, ఆనందించాలనీ, ఆరాటంగా వుంది.

మధ్యలో విమానం ఆలస్యంగా వస్తుందనేసరికి విసుగు పుట్టుకొచ్చింది.

విమానం పన్నెండుగంటలా ముప్పై నిముషాలకు వచ్చింది. రన్ వే పైన ఆగగానే, నిచ్చెనలాంటి దొకటి పదిమంది నెట్టుకెళ్ళి దానికి అనుకునేట్లు వేశారు. లోపల్నుండి తలుపులు తెరచుకున్నాయి. పాసెంజర్లు ఒకొక్కరే దిగిరావటం మొదలెట్టారు.

అందరికన్నా వెనుకగా దిగివచ్చిన సూట్ వాలాను దాదాపు వందమంది చుట్టివేయటం గమనించింది. అతని మెడనిండా దండలు వేశారు. ఫోటోలు తీశారు. చేతుల వ్రేళ్ళు కరిగిపోయేట్లు వరుసగా కరచాలనం చెయ్యసాగారు అంతా.

దూరంనుంచే చూస్తున్న విజయకు అతనెవరో తెలుసుకోవాలనిపించింది. ఆ గుంపులోంచి ఆమె వేపుగా వచ్చిన మనిషిని చూసి "ఆయన ఎవరండీ?" అడిగింది మెల్లగా.

"వారు ప్రఖ్యాత డిటెక్టివ్ సుధాకర్ గారు!" అన్నాడు.

ఆమెకు చిన్నప్పటినుండి డిటెక్టివ్ పుస్తకాలుచదవడం అలవాటు. సుధాకర్ సాధించిన కొన్ని కేసులు వివరంగా పుస్తకాల రూపంలో ప్రచురించబడ్డాయి. వాటిన్ని చదివిందామె. ఆయన్ని చూసినందుకు అమితమైన ఆనందం కలిగింది. ఓమారు మాట్లాడితే బాగుండుననిపించింది. సూట్ కేస్ పట్టుకొని ఆ గుంపువేపు వెళ్ళింది.

విజయ వెళ్ళేసరికి జనం పల్చపడ్డారు. మొత్తం పది మంది మాత్రం వున్నారు. అందరూ మగవాళ్ళే. దూరంగా నిలుచున్న ఆమెను గమనించినట్లున్నాడు సుధాకర్. వాళ్ళను వదిలేసి ఆమెవైపు వచ్చాడు.

"నమస్తే!" అంది విజయ.

ప్రతి నమస్కారం చేస్తూ "మీరు నాకోసం నిలుచున్నారా?" అడిగాడు సుధాకర్.

అవునన్నట్లు తలూపింది విజయ.

"నాతో ఏమైనా ప్రత్యేకమైన పనివుందా?"

"లేదు! మీరని తెలిశాక ఓమారు పలకరించి పోవాలనిపించింది" అంది విజయ.

"థాంక్స్! మీరు ఎక్కడికైనా వెళ్తున్నారా?"

"గోవాకు పోతున్నాను."

"అక్కడేనా వుండటం!"

"లేదండీ! ఇప్పటిదాకా ఇక్కడే వున్నాం. ఈ మధ్యనే మావారు వ్యాపారరీత్యా అక్కడ సెటిలయినారు. అందువల్ల వెళ్ళిపోతున్నాను" అంది విజయ.

"నేను గోవాకు టికెట్ కొన్నాను. ఫ్రెండ్స్ అంతా మూగి రేపు వెళ్ళమంటున్నారు. ఈ దినమంతా నా ప్రాణం తీస్తారు విందులనీ, వినోదాలనీ. నేను రేపొస్తాను. ఓమారు కాసినో హోటల్‌లో అడగండి. నా రూం నెంబరు చెప్తారు. మీ వార్ని కూడా తీసుకురండి!" అన్నాడు సుధాకర్.

"అలాగేనండి!" అంది విజయ.

"థాంక్స్! వస్తాను!" అంటూ ఆమెదగ్గర శెలవు తీసుకున్నాడు. అతను వెళ్ళినంత దూరం చూస్తూ నిలుచుంది.

ఆ తర్వాత లౌడ్‌స్పీకర్‌లో గోవాకు వెళ్ళే పాసెంజర్లు వెంటనే, విమానం చేరుకోవలసిందన్న హెచ్చరిక

వినిపించింది. హడావుడిగా పరుగెత్తుకుంటూ వెళ్ళి మెట్లెక్కి లోనికి చేరుకుంది.

చాలా సీట్లు ఖాళీగా వున్నాయి. అక్కడ వున్న వాళ్ళని కళ్ళతోనే లెఖగట్టింది. మొత్తం పదకొండు మంది వుండివుంటారనుకొంది పిల్లాజెల్లాతో కలిపి.

విజయకు మనస్సులో భయంభయంగా, గందరగోళంగా వుంది. ఇంతకుముందెప్పుడూ విమానం ఎక్కలేదు. ఇదే మొదటిసారి. కళ్ళు త్రిప్పినా, కడుపులో దేవినట్లయినా, చెమటలు క్రమ్మినా, తలనొప్పి వచ్చినా, వాడుకునేందుకు వీలుగా అవసరమైన అన్నిరకాల మందులూ వెంట తెచ్చుకుంది.

పైలట్లు పైకిరావటం, కాక్‌పిట్‌లోకి వెళ్ళడం గమనించింది. ఎయిర్‌హోస్టెస్ వచ్చింది.

ఆ తర్వాత రెండు నిముషాలకు తలుపులు మూశారు.

ఎయిర్‌హోస్టెస్ ప్రయాణీకులకు ఏవేవో సూచనలు చేసింది.

విమానం బయలుదేరుతున్న వార్త, లోపలవైపునున్న స్పీకర్లద్వారా వినిపించింది.

విజయకు అంతా వింతగా, విచిత్రంగా వుంది.

కారులా మెత్తటి తారురోడ్‌పైన పోతున్నట్లనిపించింది ముందు. ఆ తర్వాత బరువు తేలినట్లుగా తోచింది. విమానం గాలిలోకి లేచిపోయి వుంటుందనుకొని తల వెనక్కి వాల్చుకుని కూర్చుంది.

4

తాజ్ షెరతాన్ హోటల్‌లోని రెండో అంతస్తులో వున్న స్పెషల్‌రూంలో కూర్చున్న సుధాకర్, ముందున్న

ప్లేట్లోంచి వెజిటబుల్ బిరియానీ స్పూన్‌తో తీసి, పెరుగు పచ్చడితో ముంచి నోట్లో వేసుకున్నాడు.

రేడియోలోంచి వస్తున్న వార్తలను వింటూ వున్నాడు.

ఇప్పుడే వచ్చిన వార్త అంటూ బొంబాయినుంచి గోవాకు వెళ్ళవలసిన విమానం బెల్గాంకు ఇరవై మైళ్ళ దూరంలో క్రాష్ అయిపోయిన వైనం చెప్పాడు అనౌన్సరు.

స్పూన్ టేబుల్‌పైన పడేసి ఎడంచేతి వేపున్న ఫోన్ రిసీవరు అందుకుని "శాంతాక్రజ్ ఎయిరో డ్రోమ్ కంట్రోలు కనెక్టు చెయ్యండి!" అన్నాడు సుధాకర్.

రెండు నిముషాల్లో కనెక్షన్ వచ్చింది.

"నేను డిటెక్టివ్ సుధాకర్‌ను మాట్లాడుతున్నాను. రేడియోలో విన్నాను. గోవాకు వెళ్ళిన విమానం కూలి పోయిందా?"

"యస్. ప్లీజ్!"

"ఎక్కడ?"

"బెల్గాం అవతల. సెర్చిపార్టీని పంపాము. ఇంకా వివరాలు తెలీలేదు."

"ఐ. సీ. గంట తర్వాత ఫోన్ చేస్తే వివరాలు తెలుస్తా యనుకుంటాను."

సుధాకర్ నెంబరు ఇచ్చాడు. ఆ తర్వాత ఫోన్ కట్ చేశాడు.

కలకత్తానుంచి తనా విమానంలో వచ్చాడు. పైలట్‌తో బాతాఖానీ వేశాడు. ఆ విమానం ఇంగ్లాండులో తయారుచేసినట్లు, ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కున్న విమానాల్లో ఏవిధమైన రిపేరుచేయకుండా, ట్రబుల్ ఇవ్వకుండా

పనిచేస్తున్నది ఆ ఒక్క విమానమేనని గర్వంగా చెప్పాడు పైలట్.

కలకత్తాలో గ్రౌండ్ ఇంజనీర్లు దాన్ని పూర్తిగా చెక్ చెయ్యడం కళ్ళారా చూశాడు. శాంతాక్రజ్ లో కూడా ఫ్రెండ్స్ తో మాట్లాడుతూ, ఇంజనీర్లు చేస్తున్న చెకింగ్ ను గమనించాడు.

అలాంటి మంచి విమానం ఎందుకలా ఉన్నట్టుండి కూలిపోయి వుంటుందాని ఊహించసాగాడు.

గంట తర్వాత ఫోన్ వచ్చింది.

సెర్చిపార్టీకి ఆ విమానం జాడ తెలీలేదని చెప్పారు కంట్రోలు వాళ్ళు. రేడియోలో కూలిపోయిన విమానాన్ని ఎవరైనా చూస్తే వెంటనే దగ్గరేవున్న పోలీసుస్టేషనుకు రిపోర్టు చెయ్యమన్న అభ్యర్థనలు దేశమంతా ప్రసారమైనాయి.

సుధాకర్ కు తన్ను ఎయిర్ పోర్ట్ లో పలకరించిన విజయ గుర్తొచ్చింది. క్రొత్త స్థలంలో భర్తతో క్రొత్త కాపురం పెట్టడానికి బయలుదేరిన ఆమెను విధి ఎంత క్రూరంగా బలి తీసుకొని వుంటుందో ఊహించి బాధపడ్డాడు.

ఆ రాత్రంతా మేలుకునే వున్నాడు సుధాకర్.

నాలుగైదుసార్లు ఎయిర్ పోర్ట్ కు ఫోన్ చేశాడు, కానీ ఏ విధమైన సమాచారం అందలేదని చెప్పారు.

తెల్లారాక సుధాకర్ ఎయిర్ పోర్టు చేరుకున్నాడు.

ఇండియన్ ఎయిర్ లైన్స్ చైర్మన్ గారు అక్కడే కనుపించారు. ఆయన విచారంగా వున్నారు. సుధాకర్ ను చూడగానే నవ్వు తెచ్చిపెట్టుకున్నాడు మొహాన.

"ఏమీ తెలీలేదా?" అడిగాడు సుధాకర్.

"లేదు! విమానం కూలిపోయినందుకు విచారంగా వుంది. దాన్ని మించి ఎక్కడ కూలిపోయిందో తెలుసుకోనందుకు మాకంతా చాలా ఆత్రుతగా వుంది" అన్నాడు చైర్మన్.

"సెర్చిపార్టీ వెళ్ళివచ్చారుగా!"

"హెలికాప్టర్లు కూడా పంపాం. వాటికూడా ఆ విమానం ఇంకా కనుపించలేదు!"

"చిత్రంగా వుంది. అదేం చిన్నవస్తువుకాదు మాయం కావటానికి. మనం నిరుత్సాహపడి లాభంలేదు. వెయిట్ చేద్దాం! ఏదైనా సమాచారం రాకుండా వుండదు!" అన్నాడు సుధాకర్.

అంతలోనే ఫోన్ మ్రోగింది.

చైర్మన్ అందుకున్నాడు.

అవతలివేపునుండి చెప్పిన విషయాన్ని విని "థాంక్స్!" అని రసీవరు పెట్టేకాడు చైర్మన్.

"రైల్వే ఎమర్జన్సీనుండి ఫోన్ చేశారు. బెల్గాంకు మూడు మైళ్ళదూరంలో రైల్వేట్రాక్ పైన పనిచేస్తూవుండిన కొంత మంది, వెనుకభాగాన నిప్పంటుకొన్న విమానం ఒకటి ట్రాక్ కు కుడివేపుగానే వున్న అడవులవేపు కూలిపోవటం చూశామని రిపోర్టు పంపారట."

"గుడ్! సెర్చిపార్టీని తయారుచెయ్యండి. నేను కూడా వాళ్ళతో వెళ్తాను!" అన్నాడు సుధాకర్.

"మీరూ వెళ్తారా?" ఆశ్చర్యంగా అడిగాడు చైర్మన్.

"అవును!"

"ఇది డిటెక్టివ్ పనికాదు. చాలా కష్టమైన పని."

"కాబట్టే వెళ్ళాలనుకుంటున్నాను."

"గుడ్! అలాగే వెళ్ళిరండి!" అన్నాడు చైర్మన్.

5

చిన్న విమానంలో ఇద్దరు ఎయిర్‌లైన్స్ ఆఫీసర్లు, ఒక ఇంజనీరు, మరో ఫొటోగ్రాఫీసరూ, సుధాకర్, మొత్తం ఐదుగురు బయలుదేరారు.

వాళ్లెక్కిన విమానం గంటసేపట్లో బెల్గాం చేరుకుంది. అక్కడ్నుంచి కారులో రైల్వేట్రాక్ వద్దకు చేరుకున్నారు. అంతకుముందు రోజు పనిచేసిన గ్యాంగు అక్కడే వుంది.

వాళ్ళను అడిగి, విమానం కూలిపోయింది ఎటువైపన్నదీ వివరంగా తెలుసుకున్నారు.

కారును అక్కడే వదలిపెట్టారు. అంతా కాలినడకన బయలుదేరారు.

అదంతా అడవి ప్రాంతం. చెట్లు చాలా ఎత్తుగా, చిక్కగా ఎదిగివున్నాయి. సాయంత్రం నాలుగుగంటల ప్రాంతంలోనే వెళ్ళినా, అడుగు ముందుకు వెయ్యడం అత్యంత కష్టంగా కనుపించింది అందరికీ.

వాచీలు చూసుకుంటూ అడుగులో అడుగువేసుకుంటూ నడవసాగారు. చెట్లుకొన్న ముళ్ళకు తగులుకుని వేసుకున్న బట్టలు చీలికలు, పేలికలుగా మారాయి. టార్చి వెలిగించి చూసుకుంటూ ముందుకు పోసాగారు.

గంట ఐదయింది.

మరో గంటసేపు నడిచారు.

ఘాటైన వాసనేదో ముక్కులకు తగిలింది.

"ఏదో వాసన వస్తుందికదూ!" అడిగాడు సుధాకర్.

"అవును!" అన్నారు మిగిలినవాళ్ళు.

"అల్యూమినియంను కాల్చితే వచ్చే వాసనలాగుంది నాకు."

"అంటే ఆ విమానం ఇక్కడకు దగ్గరలోనే వుండి వుండాలి!" అంటూ ఉత్సాహంగా ముందుకు అడుగు వేశారు.

ఫర్లాంగు దూరంలో పెద్ద గొయ్యిలాంటి ప్రదేశంలో విమానం పడివుంది. వెనుక భాగమంతా నల్లగా తారులా మాడిపోయింది. ముందువేపు మొత్తం బాగుంది.

ఏదైనా ఫైర్ బర్స్ట్ అవుతుందేమోనని దూరంగా నిలుచునే చూచారు కాసేపు. అలాంటిదేమీ లేకపోవడంతో ముందు ఇంజనీర్లు, వాళ్ళవెంట వున్న మిగిలిన ఎక్స్పర్టులు విమానంవేపు వెళ్ళారు. సుధాకర్ ఒక్కడే మిగిలిపోయాడు.

అరగంట తర్వాత అంతా పైకొచ్చారు.

"ఏమైంది?" అడిగాడు సుధాకర్.

"పాసింజర్లు మొత్తం కాలి బూడిదయినారు. విమానంలో భాగాలన్నీ కూలిపోయేదాకా బాగా పనిచేసిన గుర్తులున్నాయి. టాంక్ లో గాసొలిన్ వుంది. దానికి నిప్పంటుకోలేదు. అగ్నిప్రమాదం వెనుకవేపు జరిగింది. కాని అలా జరగడం అసాధ్యం. ఆ భాగంలో మండటానికి ఏవిధమైన అవకాశంలేదు!" అన్నాడు ఇంజనీరు.

"ఆ భాగంలో ఏముంటాయి?"

"పాసింజర్ల లగేజీ, దాంతోపాటు పార్శిళ్లు వుంటాయి" అన్నాడు ఇంజనీరు.

"అసాధ్యం! పెట్రోలు, ఫిల్ములు, ఆసిడ్స్, మొదలైన సామగ్రి అసలు బుక్ చెయ్యరు" అన్నాడు ఇంజనీరు.

సుధాకర్ ఆలోచించసాగాడు.

టార్చిలు వెలిగించి కార్గో కాబిన్ లో మిగిలివున్న

పాకేజీల లిస్టు తీశారు. చాలావరకు యథాతథంగా వున్నాయి.

సుధాకర్ కూడా గోతిలోకి దిగి విమానం చుట్టూ తిరిగాడు. అక్కడినుండి వస్తున్న వాసన అతని ముక్కులను అదరగొట్టింది. చక్కెరతో చేసిన చాక్లెట్లను కాలిస్తే వచ్చే వాసనలాగుంది అది. అలాంటి వాసనే ఇంతకు ముందు ఎక్కడో గమనించాడు.

బుర్ర గోక్కున్నాడు. గుర్తొచ్చింది.

ఇండో-పాకిస్తాన్ యుద్ధంలో భారత సైన్యానికి అండగా వుండేందుకు ఆర్మీ హెడ్ క్వార్టర్సులో పని చేశాడు శత్రుసైన్యపు రహస్యాలను తెలుసుకోవటానికి. ఆ సమయంలోనే కొన్నాళ్ళు యుద్ధం జరుగుతున్న ప్రాంతాల్లోకూడా తిరిగాడు.

బాంబ్‌లు పేల్చినప్పుడల్లా ఇలాంటి వాసనే వచ్చింది. ఆ వాసన తనకు సుపరిచితంగా మొదట్లోనే అనిపించింది.

"ఈ వాసన చూస్తే మీకేమనిపిస్తుంది?" అడిగాడు ఎక్స్‌ప్లోజివ్స్ ఎక్స్‌పర్ట్.

"బాంబ్ పేల్చినట్లనిపిస్తూంది" అన్నాడతను.

తన అనుమానాన్ని అతను ధృవపరచినందుకు ఆనందం కలిగింది.

బొంబాయిలో విమానాన్ని మొత్తం చెక్ చేశారు. అందరి లగేజీ చూశారు. అలాంటప్పుడు దొంగతనంగా బాంబ్ ఎవరు పెట్టివుంటారు విమానంలో? అర్థం గాలేదు.

ప్రమాదం జరిగింది కార్గో నిల్వచేసే కాబిన్‌లో. అంటే అది లగేజీరూపంలో వచ్చివుండాలి.

సుధాకర్ మెదడు చకచక పనిచెయ్యడం మొదలెట్టింది.

విజయ గుర్తొచ్చింది. వెళ్ళి చూశాడు సుధాకర్.

నల్లగా బొగ్గులా కాలిపోయివుంది ఆమె, చీరమాత్రం కొంత మిగిలివుంది. దాన్నిబట్టే ఆమెను పోల్చుకున్నాడు.

ఆ ఉదయం అందరూ తిరిగి బొంబాయి వచ్చేశారు.

6

శాంతాక్రజ్ ఎయిర్‌పోర్టు ఎంక్వయిరీ ఆఫీసువద్ద జనం గుమిగూడారు.

కొందరు పెద్దగా ఏడుస్తున్నారు. మరికొందరు బిగ్గరగా ఏడవలేక గుడ్లనీళ్ళు కుక్కుకున్నారు. విమానం కనుపించ లేదని చెప్పినంతసేపు, అదెటు పోయివుంటుందనీ, తమ వాళ్ళంతా క్షేమంగానే వుండివుంటారనీ, ఊహించారు.

విమానం కాలిపోయిన ప్రదేశం, దాని ఫొటోలు పేప ర్లలో వేశాక జనాన్ని ఆపడం పెద్ద కష్టమైపోయింది ఎయిర్‌లైన్స్ అధికారులకు.

ప్రభుత్వం చనిపోయినవారి దగ్గరి బంధువులకు వెంటనే లక్షరూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని నిర్ణ యించింది. ఆ డబ్బు తీసుకొనేందుకు వచ్చిన జనాన్ని గమనించి చూడాలన్న ఉద్దేశ్యంతో సుధాకర్ ముందే వచ్చి కూర్చున్నాడు.

ఎయిర్‌లైన్స్ అధికారితోపాటు, లైఫ్ ఇన్సూరెన్స్ అధికారికూడా ఒకతను కూర్చున్నాడు.

ఒక్కొక్కరే లోపలకు రావడం మొదలెట్టారు. వచ్చిన మనిషిని సవాలక్ష ప్రశ్నలువేసి, రకరకాల కాగి తాలపైన సంతకాలు తీసుకొని ఆతర్వాత డబ్బివ్వడం గమనించాడు సుధాకర్. ఒక్కొక్క మనిషినీ కళ్ళతోనే పరిశోధన చెయ్యడం మొదలెట్టాడు.

డబ్బు అందుకుంటున్నప్పుడు ఆనందం, త్వరగా అంద బుచ్చుకుని బైటపడదామన్న ఆతృతలాంటి వేవన్నా కను పిస్తాయేమోనని ఆశగా గమనించాడు. అలాంటివేవీ ఉన్నట్లు తోచలేదు చాలామంది మొహాల్లో. ఆ డబ్బు పోయిన ప్రాణానికి విలువ కాదన్నట్లే వుంది వాళ్ళ ధోరణి.

ఆఖరులో వచ్చాడు శాంతిలాల్.

"నీ భార్య పేరు!" అడిగాడు ఎయిర్ లైన్స్ అధికారి.

"విజయ!"

"ఆమెను గుర్తుపట్టగలవా?"

"ఊఁ!"

కొన్ని ఫోటోలు తీసి పదేశాడు ముందు. ఆ బొత్తి లోంచి తన భార్య ఫోటో తీసిపెట్టాడు.

"నీ భార్య విమానం ఎక్కడం ఇదే మొదటిసారా?"

"అవునండీ!"

"ఆమె మీ భార్యేనని ఋజువుపరచే సర్టిఫికెట్లు తెచ్చారా?"

"ఇవిగో!" అంటూ అందించాడు శాంతిలాల్.

"ఈ కాగితాలపైన సంతకాలు చెయ్యండి" అంటూ కొన్ని ఫారాలు అందించాడు ఎయిర్ లైన్స్ అధికారి శాంతిలాల్ కు. అన్నింటిపైనా చకచక సంతకాలు చేసి అందించాడు. తిరిగి తీసుకున్నాడు అధికారి. లెక్కపెట్టి లక్షరూపాయలు కాష్ అందించాడు.

"ఇది మేము ఎకాయెకిన ఇస్తున్న డబ్బు. ఆ తర్వాత లెక్కగట్టి మీకు రావలసిన మిగిలినడబ్బు యిస్తాం!" అన్నాడు అతను.

"థాంక్స్!" అన్నాడు శాంతిలాల్.

"మిస్టర్ శాంతిలాల్. మీ భార్యపేర ఇన్సూరెన్సు పాలసీ వుందా?"

"ఉందండీ!"

"ఏమాత్రం?"

"రెండులక్షల రూపాయలకు?"

"అంత మొత్తానికి ప్రీమియమ్ డబ్బు చెల్లించేందుకు ఆమెకు నికరమైన సంపాదనేదన్నా వుందా?"

"నా వ్యాపారంలో సగం భాగముంది" అన్నాడు శాంతిలాల్.

"సంవత్సరానికి నీ టర్నోవర్ ఎంత?" అడిగాడు సుధాకర్ కల్పించుకుని.

"రెండు లక్షలు."

"ఎంత ఇన్‌కంటాక్సు కడతావ్?"

"మూడొందలు!"

"అంటే మీ ఆదాయం 16 వేలకు మించివుండదు. దాంట్లో మీ ఖర్చులు గడుపుకొని ఇంత పెద్ద పాలసీకి డబ్బు కట్టడం అంత సులభం కాదనిపిస్తుంది నాకు!" అన్నాడు సుధాకర్.

"నా భార్య ఆడది!" అన్నాడు శాంతిలాల్ వెక్కిరింసంగా.

"అందరి భార్యలూ ఆడవాళ్ళే!" నవ్వుతూ అన్నాడు ఇన్సూరెన్సు ఆఫీసరు.

"అది కాదు! అందంగా వుంటుంది. అడ్డదారుల్లో కూడా కొంత సంపాదించుకొంటూంటుందని నా అనుమానం!" చెప్పాడు శాంతిలాల్.

సుధాకర్‌కు వొళ్ళు మండుకొచ్చింది అతని మాటలకు.

"ఆమె పాలసీ మీ దగ్గర వుందా?"

"లేదు!"

"ఎన్నేళ్ళయింది తీసుకుని."

"గుర్తులేదు! చూడాలి."

"ఆమె తదనంతరం డబ్బు ఎవరికివ్వాలని కోరిందో తెలుసా?"

"ఇంకెవరికి? భర్తనైన నాకే!" అన్నాడు శాంతిలాల్.

సుధాకర్‌కు అతని మాటలు కాస్త వింతగా తోచాయి. అంతకుముందే అతను విజయను చూసి మాట్లాడి వుండడంతో, ఆమెగురించి శాంతిలాల్ చెప్పే మాటల్ని నమ్మాలనిపించలేదు.

"మీ అడ్రసు ఇవ్వండి!" అన్నాడు సుధాకర్.

శాంతిలాల్ కాగితంపైన వ్రాసి ఇచ్చాడు.

"మీరు కనీసం నాలుగురోజులపాటు ఈ ఊళ్ళోనే ఉండవలసి వుంటుంది" అన్నాడు సుధాకర్ కాగితాన్ని అందుకొంటూ.

"ఎందుకు?"

"మీతో మాకు పని పడవచ్చు. అందుకు."

"నాకు అవసరమైన పనులున్నాయి."

"మీకై మీరు వుండటానికి ఇష్టపడకపోతే, మిమ్మల్ని ఇక్కడే వుండే ఏర్పాటు చేస్తాను" అన్నాడు సుధాకర్ కోపంగా.

"అంటే అరెస్టు చేస్తారా?"

"అంతే అనుకోండి!"

"ఏ నేరం చేసినందుకు?"

"చేసినందుకు కాదు! చేశారేమోనని అనుమానించి నందుకు. చెయ్యనట్లు ఋజువయితే సగౌరవంగా పంపించి వేస్తాం!"

"నేను వ్యాపారస్తుణ్ని. అనవసరంగా అల్లరి పెట్టకండి. మీరు కోరినట్లే వుంటాను నాల్రోజులు. ఎవరుస్టు లాడ్జిలో రూం తీసుకుంటాను" అన్నాడు శాంతిలాల్.

"గుడ్! అలా చెయ్యండి! మంచిది!" అన్నాడు సుధాకర్.

శాంతిలాల్ వెళ్ళిపోయాడు.

"అతనితో అలా మాట్లాడారేం?" అడిగాడు ఎయిర్ లైన్స్ ఆఫీసరు.

"అతనెలా మాట్లాడాడో చూశారా?"

"మామూలుగానే మాట్లాడాడు!"

"లేదు! సుధాకర్ ప్రశ్నలకతను సరయిన సమాధానాలు చెప్పలేదు. ముఖ్యంగా అంత పెద్ద ఇన్సూరెన్సు పాలసీ ఎలా వాళ్లకిచ్చారో చిత్రంగా వుంది!" అన్నాడు ఇన్సూరెన్సు ఆఫీసరు.

"మీరు కాస్త వాకబు చెయ్యండి. దాని వివరాలు తెలియగానే నాకు తెలియపరచండి!" అన్నాడు సుధాకర్.

7

"కార్గో లిస్టంతా సరిచూశాం. అమృతలాల్ కపాడియా పేర బుక్ చేసిన ప్యాకెట్ ఒకటిమాత్రం కనుపించడం లేదు. మిగిలినవాటి తాలూకు మనుషుల్ని ఎంక్వాయిరీ చేయించాం. అందులో వాళ్ళకు వస్తున్న సామగ్రి వివరాలు సేకరించాం. అమృతలాల్ కపాడియా అనే మనిషి గోవా

లోనే ఉన్నట్లు ఎవ్వరూ చెప్పడంలేదు!" అన్నాడు ఎయిర్ లైన్స్ ఆఫీసరు.

"ఇంకెక్కడినుంచి ఎవరు పంపారు దాన్ని!" అడిగాడు సుధాకర్.

"కిరణ్మయి, ధానా, బొంబాయి అని వుంది."

"దాన్ని బుక్ చేసేందు కెవరొచ్చారో, బుకింగ్ ఆఫీసులోవాళ్ళు చెప్పగలరా?"

"అదీ ప్రయత్నించాం! నల్లటి చీర కట్టుకున్న ఎర్రటి అమ్మాయి వచ్చిందట. అందులో ఖరీదైన వాల్ క్లాక్ ఉందని చెప్పిందట. 'టక్' 'టక్'మంటూ శబ్దంకూడా వినవచ్చిందట."

"ఐ. సీ. అది ఖచ్చితంగా టైంబాంబయి వుండాలి! ఆ టక్ టక్ మన్న శబ్దం బాంబుకు అమర్చిన క్లాక్ది. అనుమానం లేదు!"

"అవును! నాకూ కూడా అలానే అనిపిస్తూంది!"

"అది బుక్ చేసిన ఆ కిరణ్మయి ఎవరో మనం కనుక్కోవాలి! అప్పుడుగాని అసలు నేరస్తులు దొరకరు" అన్నాడు సుధాకర్.

ఇద్దరు కలసి కార్గో బుకింగ్ కౌంటర్ వద్దకు వెళ్ళారు. అక్కడున్న మనిషిని చూసి "ఇతనేనా ఆరోజు డ్యూటీలో వుంది" అడిగాడు సుధాకర్.

"అవును!"

"వాల్ క్లాక్ బుక్ చేసిన స్త్రీని చూస్తే నువ్వు మళ్ళీ గుర్తుపట్టగలవా?" అడిగాడు సుధాకర్.

"సులభంగా! ఆమె చాలా అందంగా వుంటుంది సార్. వెళ్ళేప్పుడు రజాక్ టాక్సీలో వెళ్ళిపోయింది" అన్నాడు అతను.

"రజాక్ ఇక్కడే వుంటాడా?"

"ఆఁ! ఎప్పుడూ ఎయిర్‌పోర్టులోనే వుంటాడు. ఉన్నాడేమో చూడమంటారా?"

"చూడు!"

అతను లేచి వెలుపలికి వెళ్ళాడు.

"ఆ శాంతిలాల్‌కూ, ఎయిర్‌క్రాష్‌కూ సంబంధం వుందంటారా?" అడిగాడు ఎయిర్‌లైన్స్ అధికారి.

"చెప్పలేము! వుండేందుకు అవకాశం వుంది. అతని భార్యపేర అతను అంత పెద్ద మొత్తంలో ఇన్సూరెన్స్ తీసుకోవటం, వాల్‌క్లాక్ అమృతలాల్ అనే వ్యక్తికి బుక్ చెయ్యబడటం వాటినిబట్టి శాంతిలాల్‌కు ఇందులో సంబంధముందనిపిస్తూంది. శాంతిలాల్ వెనుక సి. ఐ. డి లను నియమించాను. వాళ్ళు తెచ్చే సమాచారాన్నిబట్టి మనమేం చెయ్యవలసిందీ తేల్చుకుందాం!" అన్నాడు సుధాకర్.

ఆలోగా ఖాకీ యూనిఫాంలో వున్న మధ్య వయస్సు వ్యక్తి ఒకతను వచ్చి నిలుచున్నాడు.

"నా పేరు రజాక్ సార్!" అన్నాడు సుధాకర్‌తో.

"రా! ఆరోజు కార్గో బుకింగ్ ఆఫీసునుంచి తీసుకెళ్ళిన నల్లచీర అమ్మాయిని ఎక్కడ దించావో గుర్తుందా?" అడిగాడు.

"ఆఁ! ఉంది సార్!"

"అక్కడికి నన్ను తీసుకెళ్తావా?"

"జీసాబ్!" అన్నాడు రజాక్.

"పద వెళ్దాం."

8

టాక్సీ జోరుగా వెళ్ళసాగింది. చాలాదూరం పోయి ఒక సన్నటి వీధిలో చిన్న ఇంటి ముందాగింది.

"ఇక్కడే దిగిందా?" అడిగాడు సుధాకర్.

"అవును సార్!"

"ఇప్పుడే వస్తాను! ఉండు!" అంటూ దిగివెళ్ళి తలుపు తట్టాడు. తలుపులు తెరచుకున్నాయి.

ఎదురుగా అందమైన స్త్రీ కనుపించింది.

"ఎవరు కావాలి?" అడిగింది ఆమె.

"తెలీదు! బహుశా నువ్వేనేమో?" అన్నాడు సుధాకర్.

"ఏమిటా తలతిక్క మాటలు? ఇంతకీ మీరెవరు?"

"నాపేరు సుధాకర్! డిటెక్టివ్‌ను. కిరణ్మయిని వెతుక్కుంటూ వచ్చాను, ఆమె నువ్వు కాదుగా?"

"కాదు! నాపేరు అరుణారాణి" అందామె.

"కిరణ్మయి ఎక్కడుంటుంది? నీతో కాదా?"

"అసలలాంటి పేరుగల ఆమె నాకు తెలీదు!" అందామె.

"కానీ ఆమె టాక్సీలో వచ్చి దిగి ఈ యింట్లోకి వెళ్ళింది మూడురోజుల క్రితం. తీసుకొచ్చిన టాక్సీవాలా నావెంట వున్నాడు. పిలిచేదా?"

"అవసరం లేదు!"

"అయితే చెప్తావా?"

"ఏమని?"

"ఆ కిరణ్మయి ఎవరో ఏమిటో?" అడిగాడు సుధాకర్.

"ఆమె నాతోపాటు స్కూల్లో చదువుకుంది. అప్పు

డప్పుడూ వచ్చిపోతూ వుంటుంది. పోయిన దఫా వచ్చి నప్పుడు చెప్పింది. తన్ను అమృతలాల్ అనే వ్యక్తి ప్రేమించాడనీ, అతని దగ్గరకు గోవాకు వెళ్ళిపోతున్నాననీ చెప్పింది," అంది అరుణారాణి.

"అమృతలాల్ దగ్గరకు వెళ్ళిపోయిందా?"

"ఆ తర్వాత ఆమె నాకు కనుపించలేదు!" అంది అరుణారాణి.

"ఈ వూళ్ళో వుండగా ఎక్కడుండేదామె?"

"ఏదో అడ్రసు చెప్పింది. నేనెప్పుడూ వెళ్ళలేదు. తనే వచ్చిపోయేది?"

"నువ్వేం చేస్తూంటావు?"

"అంటే...?"

"ఇంట్లో వేరే ఎవ్వరూ లేనట్లుంది. ఏదైనా ఉద్యోగం చేస్తున్నావా? లేక..."

"ఆగిపోయారేం? కూటికోసం కోటి విద్యలు. నాది ఒక విద్య. మీలాంటివాళ్ళను సుఖపెట్టి, మీరు ఆనందించిన దానికి బదులుగా ఇచ్చే డబ్బుతో బ్రతుకు తుంటాను" చెప్పిందామె.

"నీ దగ్గర కెప్పుడైనా శాంతిలాల్ అనే అతను వచ్చాడా?" అడిగాడు సుధాకర్.

"చాలా పేర్లు విన్నాను. అందరినీ గుర్తుపెట్టుకొనే అవకాశంగానీ, అవసరంగానీ, నాకుండదని మీకు తెలుసను కుంటాను."

"పోనీ ఈ రూపంగల మనిషిని చూశావా?" అంటూ శాంతిలాల్ ఫోటో తీసి చూపించాడు.

ఆ ఫోటో చూడగానే క్షణకాలం అవాక్కయి పోయింది అరుణారాణి. అంతలోనే తమాయించుకొంది.

"లేదు!" అంది తల ప్రక్కకు త్రిప్పుకొని.

"సరిగ్గా చూసి చెప్పు."

"చూశాను! అతన్ని నేను చూడలేదు!" అంది నిక్కచ్చిగా.

అంతలో "సాబ్" అంటూ వచ్చాడు రజాక్ లోనికి.

"ఏమిటి?" అడిగాడు సుధాకర్.

"మీతో ఒక చిన్నమాట చెప్పాలి సార్," అన్నాడు రజాక్.

"చెప్పు!" అన్నాడు సుధాకర్.

"ఇలా బయటకు రండి చెప్తాను" అన్నాడు రజాక్.

సుధాకర్ అతనితో వెలుపలకు వచ్చాడు.

"ఏమిటి?" అడిగాడు సుధాకర్.

"మొన్న టాక్సీలో వచ్చినది ఆమెనే సార్! నెల రోజుల క్రితం ఒకసారి టాక్సీలో మొన్న విమాన ప్రమాదంలో చచ్చిపోయిన ఆమెను ఇక్కడకు నేను తీసుకొచ్చాను సార్. ఆమే, యీవిడ కొట్టుకున్నారు. అదేదో ఆమె భర్తను ఈమె వల్లో వేసుకుందని తిట్టినట్లు జ్ఞాపకం" అన్నాడు.

సుధాకర్‌కు ఆ సమాచారం వినగానే ఏనుగెక్కినట్లయింది.

"రజాక్! నువ్వు చెప్పింది చాలా విలువైన విషయం. నాపని చాలా సులభం చేశావ్! ఇప్పుడే వస్తానుండు!" అంటూ లోనికి వెళ్ళాడు సుధాకర్.

"నీకు శాంతిలాల్ తెలియదన్నావ్? పోనీ అతని భార్య విజయ కౌర్‌ను తెలుసా?"

తెలీదన్నట్లు తలూపింది అరుణారాణి.

"బాగా గుర్తుచేసుకొని చెప్పు!"

"తెలీదన్నానుగా?" అంది అరుణారాణి.

"కానీ వెలుపలున్న టాక్సీ డ్రైవరు నిన్ను ఇంతకు ముందు చూశాడట. ఎయిర్ క్రాష్‌లో చచ్చిపోయిన విజయకౌర్‌ను అతనే ఇక్కడకు టాక్సీలో తీసుకొచ్చాడట. ఆరోజు మీరిద్దరూ కొట్లాడుకున్నారట. మొన్న నిన్ను విమానాశ్రయంనుంచి కూడా అతనే తీసుకొచ్చాడట."

మౌనంగా వుండిపోయింది అరుణారాణి.

"నేనివన్నీ ఎందుకడుగుతున్నానో తెలుసా? ఘోరమైన విమానప్రమాదం జరిగింది. అనేకమంది అమాయకులు చనిపోయారు. వాళ్ళ బంధువులు ఆర్తనాదాలు చేస్తున్నారు. ఆ విమానప్రమాదం యాదృచ్ఛికంగా జరిగింది కాదు. ఎవరో పథకంవేసి దాన్ని ప్రమాదానికి గురిచేశారు.

అమృతలాల్ అనే వ్యక్తి పేర బుక్ చెయ్యబడ్డ వాల్ క్లాక్ పాకెట్‌లో టైంబాంబు పెట్టారు. దాన్ని కిరణ్మయి పేరుతో బుక్ చేసింది నీవు. ఆ ప్రమాదంలో విజయ కౌర్ అంటే శాంతిలాల్ భార్య చనిపోయింది. ఆమెకూ నీకూ తగూ వుంది. మీరిద్దరూ కొట్టుకున్నారు. అందువల్ల ఆమెను చంపాలన్న ఉద్దేశ్యంతో ఆ పాకెట్‌ను నువ్వే పంపించి వుండాలి. దీనికి శిక్ష ఏమిటో తెలుసా? ఉరి" అన్నాడు సుధాకర్.

అరుణారాణి బిక్కచచ్చిపోయింది.

"విజయకౌర్‌ను నాకు తెలుసు. కానీ ఆమెను చంపాలని నాకు లేదు. ఆ పాకెట్‌లో టైంబాంబు వున్న సంగతి కూడా నాకు తెలీదు. శాంతిలాల్ దాన్ని పంపించాడు, అతనే దాన్ని అమృతలాల్ అనే వ్యక్తికి ఎయిర్ పార్శిల్ చేయించమన్నాడు."

"నీకు తెలీకుండానే నీచేత అతను పెద్ద నేరం చేయించాడు."

"నాకెన్నో అబద్ధాలు చెప్పాడు. స్వర్గం చూపించాడు అరచేతిలో. అతని మాటల మత్తులోపడి మోసపోయాను. ప్రాణాలపైకి తెచ్చుకొన్నాను" అంది ఏడుస్తూ అరుణారాణి.

"అలా విచారించకు. నిజంగా నీకు తెలీకుండానే ఆ పార్శిల్ పంపి వుంటే నిన్ను కోర్టు క్షమించే అవకాశం వుంది. కానీ బోనెక్కి నాకు చెప్పినట్లే, నువ్వు మొత్తం నిజం చెప్పాలి!" అన్నాడు సుధాకర్."

"చెప్తాను! ఆ దుర్మార్గుడు చేసినదానికి తగిన శాస్తి కావాలి!" అంది కోపంగా అరుణారాణి.

వెనక్కి తిరిగొచ్చి టాక్సీ ఎక్కాడు. శాంతిలాల్ కోసం వెళ్ళాడు ఎవరెస్టు హోటల్ కు.

అతను వుంటున్న గది తాళంవేసి వుంది.

9

"వదులు! నన్నొదలు! నీ పాపం పండింది!" అంటూ అరుస్తూంది అరుణారాణి.

"నిన్ను బ్రతకనిస్తే నేను చావాలి! నిన్ను వదలను!" అరుస్తున్నాడు శాంతిలాల్.

"నీ సంగతి మొత్తం డిటెక్టివ్ సుధాకర్ కు చెప్పాను. నన్ను చంపినా నువ్వుమాత్రం తప్పించుకోలేవు."

"అందుకే నిన్ను చంపి సాక్ష్యం లేకుండా చేసుకుంటాను."

సుధాకర్ ఠక్కున తలుపులు త్రోసుకుని, లోపలకు

దూకి, శాంతిలాల్ పైకి లంఘించి, వెనుకనుంచి మెడ దొరకపుచ్చుకున్నాడు.

శాంతిలాల్ తిరగబడటానికి ప్రయత్నించాడు. కానీ సుధాకర్ పట్టు ఉడుంపట్టులా మెడమీద బిగుసుకుపోయింది. దాంతో పిట్టలా చిక్కిపోయి గిలగిల కొట్టుకున్నాడు.

శాంతిలాల్ కోర్టులో చెప్పాడు. తనకు భార్యపైన ప్రేమ లేదని, అరుణారాణితో ఆనందంగా బ్రతకాలని కోరుకున్నానని, భార్య తనకు అడ్డులేకుండా వుండేందుకు చంపాలని నిశ్చయించుకున్నట్లు చెప్పాడు.

నాటుబాంబు సంపాదించి, గడియారాల మెకానిక్ నొకణ్ణి మంచి చేసుకొని, దానికి టైమింగ్ డివైజ్ తయారు చేయించానని కూడా చెప్పాడు.

అసలు విషయం చెప్పకుండా అరుణారాణి ద్వారా దాన్ని అమృతలాల్ అనే పేరుకు బుక్ చేయించినట్లు కూడా ఒప్పుకున్నాడు శాంతిలాల్ కోర్టులో.

భార్యను ఎటూ చంపదలచుకున్నందువల్ల, ఆమె చేత సంతకాలు చేయించుకొని ఆమె పేర నెల రోజులు క్రితం రెండు లక్షల రూపాయలకు లైఫ్ పాలసీ తీసుకున్నట్లు కూడా ఒప్పుకున్నాడు.

కోర్టు శాంతిలాల్ కు ఉరి శిక్ష విధిస్తూ, ఇంతకన్న పెద్ద శిక్షకు శాంతిలాల్ పాత్రుడయినా, అలాంటిది లేనందువల్ల ఉరి శిక్ష విధిస్తున్నామన్నారు.

—:ఐపోయింది:—